సాక్షి
వికారాబాద్
మంగళవారం : 23 : జనవరి : 2024



తాండూరు టౌన్: పట్టణంలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



న్యూస్‌రీల్

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



పంచాయతీ భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు

పరిగి: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తొండుపల్లిలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కడ సమస్య ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే నియోజకవర్గం ప్రగతి బాటలో నడుస్తుందన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేషగిరి శర్మ, సర్పంచ్ గీతా, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్ , నాయకులు హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు హార్టికల్చర్ యూనివర్సిటీ వీసీ పర్యటన

వికారాబాద్ అర్బన్: ఈ నెల 24న కొండ లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ నీరజ ప్రభాకర్ బృందం సభ్యులు జిల్లాలో పర్యటించనున్నట్లు ఉద్యానవన శాఖ జిల్లా అధికారి చక్రపాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బృందం పూడూరు గ్రామంలోని ఆర్చిడ్ పాలీ హౌసును, మామిడి తోటను, వికారాబాద్‌లోని హార్టికల్చర్ ఫార్మును క్షేత్రస్థాయిలో సందర్శించనున్నట్లు తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం 2గంటలకు కలెక్టర్ కార్యాలయంలో మామిడి సాగుపై రైతుల కు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

108లో ఇంటర్వ్యూకు ఆహ్వానం

కందుకూరు: 108 ఈఎంఆర్‌ఐలో ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేయడానికి అర్హులైన అభ్యర్థులు నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావచ్చని ఆ సంస్థ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ నెల 25వ తేదీ వరకు సికింద్రాబాద్ మేడ్చల్ రోడ్డులోని దేవరయంజాల్‌లోని ఈఎంఆర్‌ఐ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపింది. బీటెక్ పూర్తయిన అభ్యర్థులు అర్హులని పేర్కొంది.

కబ్జాకు గురైన దేవాలయ భూమి స్వాధీనం

షాద్‌నగర్: కబ్జాకు గురైన దేవాదాయశాఖ భూములను ఆశాఖ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. మొగిలిగిద్ద పంచాయతీ పరిధిలోని శ్రీ రంగనాయక స్వామి దేవాలయానికి షాబాద్ మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ శివారులో సర్వే నంబర్ 280/1లో 4 ఎకరాల 38గుంటలు, సర్వేనంబర్ 280/2లో 5 గుంటల భూమి ఉంది. ఈ భూమి కొన్నేళ్ల క్రితం కబ్జాకు గురికావడంతో దేవాదాయశాఖ అధికారులు కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం కబ్జాకు గురైన భూమిని జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ శేఖర్ ఆధ్వర్యంలో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు దేవాలయ భూమిలో బోర్డును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆ శాఖ పరిశీలకుడు మధుబాబు, ఈఓటీ శివకుమార్, అనంతగిరి ఈఓటీ నరేందర్ తదితరులు ఉన్నారు.

'పల్లె ప్రగతి'తో సత్ఫలితాలు

ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: పల్లె ప్రగతితో మన పల్లెలు స్వచ్ఛ గ్రామాలుగా మారాయని, ఇదంతా అందరి కృషితోనే సాధ్యమైందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని అన్నోజిగూడలో స్థానిక సర్పంచ్ కాకి ఇందిర ఆధ్వర్యంలో రూ.30 లక్షలతో నిర్మించిన జీపీ భవనాన్ని సోమవారం జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి ప్రారంభించారు. అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో చేపట్టిన పల్లె ప్రగతి ద్వారా సత్ఫలితాలు వచ్చాయన్నారు. నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుతో పాటు ట్రాలీలు, ట్యాంకర్లు గ్రామాలకు అందించామన్నారు. పల్లె ప్రగతి ద్వారా ప్రస్తుత సర్పంచులు, ఎంపీటీసీల హయాంలో జరిగిన అభివృద్ధి తరతరాలకు గుర్తుండి పోతుందన్నారు. ప్రజల వద్దకు పరిపాలనలో భాగంగా నూతన కలెక్టర్ కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.



వికారాబాద్ అర్బన్: రామాలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న భక్తులు

భక్తజన పరవశం

అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని సోమవారం జిల్లా వ్యాప్తంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఊరూరా మహా శోభాయాత్ర నేత్ర పర్వంగా సాగింది. ప్రతి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరామ నామస్మరణతో వీధులు మార్మోగాయి. భక్తులు పరవశించిపోయారు.



కొడంగల్‌లో శోభాయాత్ర, తాండూరు టౌన్: సీతారాముల వేషధారణలో చిన్నారులు

కొడంగల్‌కు మహర్దశ

నియోజకవర్గ అభివృద్ధిపై సర్కారు ప్రత్యేక దృష్టి

- వంద పడకల అప్‌గ్రేడ్‌గా కొడంగల్, కోస్గి ఆస్పత్రులు
- జీఓ 69తో సాగునీరు
- యాభై ఎకరాల్లో ఉద్యానవన పరిశోధన కేంద్రం



కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రి

కొడంగల్: కొడంగల్‌కు మంచి రోజులు వచ్చాయి. నియోజకవర్గంలోని 8 మండలాల అభివృద్ధిపై రేవంత్ సర్కార్ దృష్టి సారించింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఏడాది తర్వాత కొడంగల్‌కు నిజాం పాలన నుంచి విముక్తి లభించింది. నాటి నుంచి నేటి వరకు ఈ ప్రాంతం అన్ని రంగాల్లోనూ వెనుకబాటుకు గురైంది. తెలంగాణ ఏర్పడక ముందు సీమాంధ్ర పాలకులు, తెలంగాణ వచ్చినా సొంత పాలకులు పట్టించుకోలేదు. దీంతో ఈ ప్రాంతానికి విద్య, వైద్యం, రవాణా, ఉపాధి, మౌలిక సదుపాయాలు కల్పించడంలో పాలకులు నిర్లక్ష్యం వహించారు. గత పాలకుల వివక్ష వల్ల కొడంగల్‌ను రెండు ముక్కలు చేసి ఉనికిని ప్రశ్నార్థకంగా మార్చారు. దీంతో ఆగ్రహించిన ప్రజలు మార్పు కోరుకున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన రేవంత్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో ఈ ప్రాంత రూపురేఖలు మారబోతున్నాయి. కొడంగల్ అభివృద్ధి కోసం కడా (కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ)ను ఏర్పాటు చేశారు. ఈ అథారిటీ పరిధిలో నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు చేపట్టారు. కడా చైర్మన్‌గా కలెక్టర్ నారాయణరెడ్డి, ప్రత్యేకాధికారిగా వెంకట్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. వీరి ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ అభివృద్ధి పనులకు శాఖల వారీగా సిద్ధం చేసిన ప్రతిపాదనలను మంగళవారం కడా ఆధ్వర్యంలో కలెక్టర్‌కు సమర్పించే అవకాశం ఉంది. కొడంగల్, కోస్గి ఆస్పత్రులను 100 పడకలుగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని నిర్ణయించారు. గురుకులాలు, పాఠశాలలకు ప్రభుత్వ స్థలాలను గుర్తిస్తున్నారు. జీఓ 69తో కొడంగల్, నారాయణపేట, మక్తల నియోజకవర్గాలకు సాగునీరు అందించనున్నారు. ఇప్పటికే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. కొడంగల్‌ను రెవెన్యూ డివిజన్‌గా, మద్దూరును మున్సిపల్‌గా అప్‌గ్రేడ్ చేయనున్నారు. వికారాబాద్ – కృష్ణా రైల్వే లైన్‌కు లైన్ క్లియర్ కానుంది. ఇప్పటికే సీఎం రేవంత్ ఆ శాఖ అధికారులతో చర్చించిన విషయం తెలిసిందే. నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. నియోజకవర్గానికి వ్యవసాయ డిప్లమో కళాశాల, 50 ఎకరాల్లో ఉద్యానవన పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయడానికి అధికారులు కృషి చేస్తున్నారు. కొడంగల్ బస్టాండ్ విస్తరణపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. కోస్గి ఆర్టీసీ బస్సు డిపోకు జవసత్వాలు పోయనున్నారు. ప్రస్తుతం 10 ఆర్డినరీ, ఒక ఎక్స్‌ప్రెస్ బస్సుతో డిపోను నడిపిస్తున్నారు. త్వరలో కోస్గి డిపో స్థాయిని పెంచే అవకాశం ఉంది. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కోస్గిలో ఇంజనీరింగ్ కళాశాల, కొడంగల్‌లో పీజీ అధ్యయన కేంద్రం ఏర్పాటు చేయాలనే ఆలోచనలో సర్కార్ ఉంది. నియోజకవర్గంలో మూసి వేసిన ప్రభుత్వ పాఠశాలలను తిరిగి ప్రారంభించడానికి కృషి జరుగుతోంది. ప్రతి గ్రామం, తండాలో ప్రభుత్వ పాఠశాల ఉండాలని రేవంత్ కృతనిశ్చయంతో ఉన్నట్లు సమాచారం.



కొడంగల్ నియోజకవర్గం కొత్త మ్యాప్





పొలిటికల్ వార్!

ఎంపీ వర్సెస్ మాజీ ఎంపీ

- విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి మధ్య ముదురుతున్న వివాదం
- ఇటీవల పోలీస్ స్టేషన్ వరకు వెళ్లిన పంచాయితీ
- ఎంపీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజుకుంటున్న వేడి

వికారాబాద్: చేవెళ్ల బీఆర్‌ఎస్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, బీజేపీ మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మధ్య నెలకొన్న వివాదం చినికిచినికి గాలివానలా మారుతోంది. ఇన్నాళ్ల పాటు నివురుగప్పిన నిప్పులా ఉన్న ఈ వ్యవహారం ఇటీవల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకునే వరకూ వెళ్లింది. ఇది కాస్తా కార్యకర్తల మధ్య చిచ్చు రాజేస్తోంది. సోషల్ మీడియా వేదికగా ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకుంటున్నారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికల నగారా మోగనున్న నేపథ్యంలో ఈ నేతల మధ్య వివాదం మరింత ముదిరేలా ఉందనే చర్చ సాగుతోంది.

అసలేం జరిగిందంటే..

ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఇద్దరూ చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం నుంచి టీఆర్‌ఎస్ తరఫున ఎంపీలుగా గెలిచిన వారే. 2014 ఎన్నికల్లో కొండా టీఆర్‌ఎస్ నుంచి గెలుపొంది ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల నుంచి కాంగ్రెస్ తరఫున కొండా, టీఆర్‌ఎస్ నుంచి రంజిత్ రెడ్డి పోటీ చేయగా రంజిత్‌రెడ్డి గెలుపొందారు. అనంతరం విశ్వేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. నాటి నుంచి వీరి మధ్య కోల్డ్ వార్ నడుస్తోంది. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఈ ఇద్దరు నేతలూ పోటీ పడే అవకాశం ఎక్కువగా ఉంది. దీంతో ఎవరి గ్రూపులను వారు బలోపేతం చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. ప్రత్యర్థి పార్టీ నాయకులపైనా గురి పెట్టారు. ఇందులో భాగంగానే ఇటీవల కొండా విశ్వేశ్వర్‌రెడ్డి.. రంజిత్‌రెడ్డి అనుచరులైన కొందరు బీఆర్‌ఎస్ కార్యకర్తలతో మాట్లాడినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ రంజిత్‌రెడ్డి నేరుగా విశ్వేశ్వర్‌రెడ్డికే ఫోన్ చేసి 'నా అనుచరులతో నువ్వేలా మాట్లాడతావు' అని నిలదీసినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రంజిత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విశ్వేశ్వర్‌రెడ్డి బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ తదితరులు

ఆడపిల్లలపై వివక్ష తగదు

- అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఆడపిల్లలపై వివక్ష రూపుమాపాలంటే కుటుంబ వ్యవస్థలో మార్పు రావాలని అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ అభిప్రాయపడ్డారు. ఈ నెల 24న జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ అధికారి పద్మజ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆడ, మగ అనే తేడా పిలిచే పిలుపులో తప్ప చూపించే ప్రేమలో ఉండకూడదని అన్నారు. అమ్మాయిలు ధైర్యంగా సమస్యలను ఎదుర్కొని, బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాలల్లో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించాలని, ప్రతి అంశంపై చర్చించే విధంగా శిక్షణ ఇవ్వాలని డీఈఓకు సూచించారు. తల్లిదండ్రులు, టీచర్లు స్నేహభావంతో ఉన్నప్పుడు అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలను వారితో ధైర్యంగా చెప్పగలుగుతారన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం బాలికలు సమాజానికి మణిహారం.. బాలికలకు రక్షణ కల్పిద్దాం.. వారి బంగారు భవితకు పునాది వేద్దాం.. స్వేచ్ఛాయుత వాతావరణం, పోషకాహారం అందించి వారి అభివృద్ధికి తోడ్పడుదాం.. బాలికలను బతకనిద్దాం, చదవనిద్దాం.. 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేద్దాం.. మనవంతు సాయం అందించి బంగారు తెలంగాణకు బాటలు వేద్దామని అదనపు కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మన్ నరేందర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర రావు, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి పద్మజ, సివిల్ సప్లయ్ డీఎం విజయలక్ష్మి, సూపర్‌వైజర్స్, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్లు, వివిధ బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు, ఎన్జీవోల అధికారులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో అర్జీల స్వీకరణ

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..శాఖల వారీగా స్వీకరించే ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎయిర్ ఫోర్స్‌లో చేరండి

కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: ఎయిర్ ఫోర్స్‌లో (అగ్ని వీర్ వాయు) చేరేందుకు యువతి, యువకులు ముందుకు రావాలని కలెక్టర్ సీ నారాయణరెడ్డి కోరారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వింగ్ సికింద్రాబాద్ విభాగం కమాండర్ గుర్ ప్రీత్ అత్వాల్‌తో కలిసి మాట్లాడారు. ఇంటర్ లేదా ఇంటర్ స్థాయిలో ఇతర కోర్సులు చేసిన విద్యార్థులు మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో 50శాతం మార్కులు పొందిన వారు అర్హులని తెలిపారు. 2-1-2004, 2-7-2007 మధ్య జన్మించిన యువతి, యువకులు అగ్ని వీర్ వాయు ఎంపికకు అర్హులన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ జనవరి 17 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు htt://afnipathvayu.cdac.in/లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్చి 17న ఆన్‌లైన్ పరీక్ష ఉంటుందని తెలిపారు. అంతకుముందు ఎయిర్ ఫోర్స్ కమాండర్ గుర్ ప్రీత్ అత్వాల్ స్థానిక ఎస్‌ఏపీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులకు అగ్ని వీర్ వాయుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, జిల్లా యువజన క్రీడల అధికారి హన్మంత్ రావు, ఎయిర్ ఫోర్స్ అధికారి కె.రాజేష్ పాల్గొన్నారు.

ఓటరు దినోత్సవానికి ఏర్పాట్లు చేయండి

ఈ నెల 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని కలెక్టర్ సీ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు జాతీయ ఓటరు దినోత్సవంపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష చేశారు. 25వ తేదీ ఉదయం 9గంటలకు స్థానిక ఎన్నెపల్లి చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించాలని, ఇందుకోసం ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలని సూచించారు. ర్యాలీ అనంతరం కలెక్టరేట్ వద్ద ప్రతిజ్ఞ కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం ఐదుగురు వయో వృద్ధులు, ఐదుగురు కొత్త ఓటర్లను సన్మానించాలని ఆదేశించారు. ఈ నెల 26న కలెక్టరేట్‌లో నిర్వహించే గణతంత్ర వేడుకలకు ఆకర్షణీయమైన శకటాలు, స్టాల్స్‌ను సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేసేందుకు ప్రతి కార్యాలయం నుంచి ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు. పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.

ప్రజావాణిలో 45 అర్జీలు

సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 45 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులకు అందజేసి వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు.

కిక్ బాక్సింగ్‌లో విద్యార్థినుల ప్రతిభ

ఖేల్ ఇండియా ఉమెన్స్ కిక్ బాక్సింగ్ జాతీయ స్థాయి పోటీల్లో బొంరాస్‌పేట్ కేజీబీవీకి చెందిన నలుగురు విద్యార్థినులు ప్రతిభ చూపి పతకాలు సాధించినట్లు కలెక్టర్ నారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ వైష్ణవి గోల్డ్ మెడల్(8వ తరగతి), పీ నందిని సిల్వర్ మెడల్(8వ తరగతి), ఎస్ నవిత సిల్వర్ మెడల్(8వ తరగతి), ఎస్ నందిని కాంస్య పతకం(9వ తరగతి) సాధించినట్లు తెలిపారు. ఈ నెల 20, 21వ తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. సోమవారం కలెక్టర్ తన కార్యాలయంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, కేజీబీవీ ఎస్‌ఓ రాధిక, శిక్షకుడు సాయిలు విద్యార్థినులను అభినందించారు.

నేటి నుంచి స్లాట్ బుకింగ్

- మూడు రోజుల పాటు సదరం క్యాంపులు

వికారాబాద్ అర్బన్: తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఈ నెల 24, 30, 31వ తేదీల్లో, అలాగే వికారాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 27,30వ తేదీల్లో దివ్యాంగుల కోసం సదరం క్యాంపు నిర్వహించనున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి సోమవారం ఒక పకటనలో తెలిపారు. 23వ తేదీ 12గంటల నుంచి మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. గతంలో సదరం సర్టిఫికెట్ పొంది కాల పరిమితి అయిపోయిన వారితో పాటు కొత్తగా స్లాట్ బుక్ చేసుకున్న వారు హాజరు కావాలని సూచించారు.

క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ కృషి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

దౌల్తాబాద్: విద్యారంగంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీఎస్‌యూటీఎఫ్ సంఘం ముందుంటుందని ఆ సంఘం జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఎఫ్.నర్సిములు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల శాఖ, కాంప్లెక్స్ హెచ్‌ఎంల చేతులమీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఊషన్న, బసంత్, రాజు, శాఖ మండల అధ్యక్షుడు అనిల్, ప్రధాన కార్యదర్శి భీంరెడ్డి, కృష్ణయ్య, అశోక్‌గౌడ్, బాలకృష్ణారెడ్డి, రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్

కందుకూరు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, మతోన్మాద ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పాషా నరహరి భవన్‌లో ఆ సంఘం మండల అధ్యక్షుడు అంకగల్ల కుమార్ అధ్యక్షతన మండల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో పేదలు మరింత పేదలుగా మారుతున్నారని విమర్శించారు. సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంయుక్తంగా గ్రామాల్లో పర్యటించి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజు, నాయకులు శేఖర్, సత్తయ్య, ఆర్.యాదయ్య, ఎం.యాదయ్య, జంగయ్య, జి.శ్రీకాంత్, కె.శ్రీకాంత్, శ్రీధర్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



యూనియన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్‌రూరల్: పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హామీ ఇచ్చారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమన్నారు. గత ప్రభుత్వాలు గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్య వైఖరిని అవలంబించాయన్నారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, సమస్యలను పరిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కార్మికులు ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి జంగయ్య, నాయకులు వీరేశ్, సత్యమ్మ, చంద్రయ్య, బుచ్చమయ్య, ప్రసాద్, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుర్చీ కొట్లాట!

- అవిశ్వాసం కోసం పైలెట్ వర్గం పాట్లు
- చైర్‌పర్సన్ రేసులో పట్లోళ్ల దీపనర్సింహులు
- మెజార్టీ కోసం అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లకు గాలం
- రసవత్తరంగా తాండూరు మున్సిపల్ రాజకీయం

తాండూరు: మున్సిపల్ రాజకీయం మరోసారి వేడెక్కుతోంది. ఒప్పందం ప్రకారం ఇద్దరు చైర్‌పర్సన్‌లు కొనసాగాలని బీఆర్‌ఎస్ పార్టీ అధిష్టాన నేతలు నాలుగేళ్ల క్రితం నిర్ణయించారు. దీంతో రెండున్నరేళ్ల పాటు చైర్‌పర్సన్‌గా తాటికొండ స్వప్నపరిమళ్ కొనసాగారు. గడువు ముగిసిన తర్వాత కూడా చైర్‌పర్సన్ స్వప్న పదవికి రాజీనామా చేయలేదు. వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల దీపనర్సింహులు చైర్‌పర్సన్ పదవి కట్టబెట్టాలని ఏడాది కాలంగా బీఆర్‌ఎస్ పార్టీ నేతల చుట్టూ తిరుగుతున్నారు. గతేడాది అసెంబ్లీ ఎన్నికల వల్ల మున్సిపాలిటీలపై పార్టీ జోక్యం చేసుకోలేదు. ప్రస్తుతం ఎన్నికలు ముగియడంతో ఒప్పందం ప్రకారం చైర్‌పర్సన్ పదవి ఇవ్వాలని దీపనర్సింహులు డిమాండ్ చేస్తున్నారు.

సేకరించిన సంతకాలు

గతంలో పట్నం మహేందర్‌రెడ్డి వర్గానికి చెందిన వ్యక్తి చైర్‌పర్సన్‌గా ఉన్నారు. పట్నం శిబిరంలో ఉన్న పలువురు కౌన్సిలర్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో చైర్‌పర్సన్ తాటికొండస్వప్నకు మెజార్టీ కౌన్సిలర్‌లు కరువయ్యారు. అధికార ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్‌ల మద్దతులో ఎలాగైనా చైర్‌పర్సన్ తాటికొండస్వప్నపై అవిశ్వాసం ప్రవేశపెట్టి పదవి నుంచి దింపాలని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి వర్గీయులు సిద్ధమయ్యారు. మున్సిపల్ కౌన్సిల్‌లో మొత్తం 36 మంది కౌన్సిలర్‌లు ఉన్నారు. అవిశ్వాస తీర్మానానికి నోటీసు అందించాలంటే మొత్తంలో మూడో వంతు సభ్యులు సంతకాలు పెట్టాల్సి ఉంది. ఇప్పటికే 15 మంది కౌన్సిలర్‌ల సంతకాలు సేకరించినట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీకి అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు ముగ్గురు కౌన్సిలర్‌లు మాత్రమే ఉన్నారు. ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కొందరు కౌన్సిలర్‌లు కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు. దీంతో మున్సిపల్ కౌన్సిల్‌లో బలం పెరిగింది. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కాంగ్రెస్ పార్టీలో ఉన్న కౌన్సిలర్‌ల మద్దతు లభిస్తోందా.. లేదా అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు బీజేపీ కౌన్సిలర్‌లు అవిశ్వాసం పెట్టేందుకు సానుకూలంగా ఉన్నట్లు సమాచారం.



తాండూరు మున్సిపల్ కార్యాలయం



తాటికొండ స్వప్న పరిమళ్, చైర్‌పర్సన్



దీపనర్సింహులు, వైస్ చైర్‌పర్సన్

అన్నదమ్ముల పంచాయితీ

సాయిపూర్ ప్రాంతంలో మూడు వార్డులలో ఒకే కుటుంబానికి చెందిన వారే కౌన్సిలర్‌లుగా కొనసాగుతున్నారు. దాయాదులుగా ఉన్న వారు ఒకరంటే ఒకరికి పొసగడం లేదు. సాయిపూర్‌లోని 9వ వార్డు కౌన్సిలర్ అయిన వైస్ చైర్‌పర్సన్ దీపనర్సింహులు చైర్‌పర్సన్ పదవికోసం ఆశపడుతున్నారు. అయితే సోదరులు అయిన కౌన్సిలర్‌లు నీరజాబాల్‌రెడ్డి, పట్లోళ్ల రత్నమాలనర్సింహులు వైస్ చైరపర్సన్‌కు మద్దతు ఇవ్వడం లేదు. దీంతో అన్నదమ్ముల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి.

ఎమ్మెల్యేకు విషమ పరీక్ష

మున్సిపల్ అవిశ్వాస తీర్మానం విషయంలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డికి విషమ పరీక్ష ఎదురుకానుంది. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్‌లు అవిశ్వాస తీర్మానానికి పాల్గొనకుండా ఉంటే ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డితో జత కట్టారనే ప్రచారం సాగుతోంది. అవిశ్వాసంలో పాల్గొంటే కాంగ్రెస్ పార్టీలో చేరిన పట్నం మహేందర్‌రెడ్డి వర్గీయులతో విభేదాలు ఎదురవుతాయి. దీంతో అవిశ్వాసం విషయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పట్టించుకోవడం లేదంటూ పార్టీ వర్గాలు అంటున్నాయి.

అక్రమ నిర్మాణాలపై చర్యలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం ఆలంపల్లి పరిధిలోని గ్రామ సర్వే నంబర్లు 290, 28, 292లలో అక్రమంగా నిర్మాణాలు చేపడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈమేరకు అక్రమ నిర్మాణాలు చేపట్టిన కోడి జంగయ్య, రాంచంద్రయ్యలపై చట్టపరంగా కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని తహసీల్దార్ హెచ్చరించారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

కొడంగల్ రూరల్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ భరత్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని బోయపల్లి తండా నుంచి సోమవారం రావులపల్లి గ్రామానికి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తున్నారు. పక్కా సమాచారంతో పోలీసులు దాడులు చేసి ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వంట గ్యాస్‌కు ఆందోళన వద్దు

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: వంట గ్యాస్‌కు ఎలాంటి కొరత లేదని ప్రజలు ఆందోళనకు గురికావద్దని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక అంబిక హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ డీజీఎంతో మాట్లాడానని, అనివార్య కారణాల వల్ల ఏర్పడిన సమస్యను పరిష్కరించినట్లు తెలిపారన్నారు. ఆయిల్ కంపెనీ నుంచి 1,240 హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లు తెప్పించి పంపిణీ చేశామన్నారు. మరో వెయ్యి సిలిండర్లు రానున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి రోజు యథావిధిగా సిలిండర్ల బుకింగ్ ప్రకారంగా వినియోగదారుల ఇంటి వద్దకే యథావిధిగా అందిస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఆందోళన చెందకూడదని, ఈ విషయాన్ని గమనించి గ్యాస్ గోదాం వద్దకు రావద్దని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సిలిండర్ గోదాంను పరిశీలిస్తున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

మద్యం మత్తులో దారుణం!

- సెల్‌ఫోన్ అపహరించాడనే నెపంతో గొంతు కోసిన అడ్డాకూలీ
- చావుబతుకుల మధ్య బాధితుడు

ధారూరు: సెల్‌ఫోన్ అపహరించాడనే నెపంతో ఓ వ్యక్తిని అడవిలోకి తీసుకెళ్లి పగులగొట్టిన బీరు సీసాతో గొంతు కోసిన సంఘటన మండలంలోని కోట్‌పల్లి ప్రాజెక్టు సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్, ప్రత్యక్ష సాక్షులు చెప్పిన వివరాలిలా ఉన్నాయి. సంగారెడ్డిజిల్లా బుదెరా మండలం పిల్లోడి గ్రామానికి చెందిన గొల్ల నర్సింహులు(27), అదే జిల్లాలోని మునిపల్లి మండల పరిధిలోని కమ్మకోల్ గ్రామానికి చెందిన అంబయ్యలు గత కొంత కాలంగా వికారాబాద్‌లో అడ్డా కూలీలుగా పనిచేస్తున్నారు. వీరికి ధారూరు మండలంలోని కుక్కింద గ్రామానికి చెందిన బోయ పకీరప్ప, కుర్వ శ్రీనివాస్‌లు పని నిమిత్తం పరిచయం అయ్యారు. వీరందరూ ఆదివారం పనికి వెళ్లి రాత్రి భోజనాలు చేసి వికారాబాద్ రైల్వేస్టేషన్‌లో నిద్రకు ఉపక్రమించారు. పడుకునే ముందు పకీరప్ప సెల్‌ఫోన్‌ను నర్సింహులు తీసుకుని అందులో ఓ సినిమా చూసి తర్వాత నిద్రపోయాడు. ఉదయాన్నే అందరూ లేవడం, పకీరప్ప సెల్‌ఫోన్ కన్పించకపోవడంతో నర్సింహులును ఈ విషయమై ప్రశ్నించాడు. తన దగ్గర లేదని చెప్పడంతో పకీరప్ప కోపంతో రగిలిపోయి పథకం ప్రకారం నర్సింహులును అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. సెల్‌ఫోన్ విషయం పక్కనబెట్టి నలుగురు కలిసి వికారాబాద్‌లోని ఓ వైన్‌షాప్‌లో మద్యం తాగి ఆటోలో మున్నూరుసోమారం చెరువు వద్దకు వచ్చి స్నానాలు చేశారు. అక్కడి నుంచి కోట్‌పల్లి ప్రాజెక్టు సమీప మేకలోని వాడుక అడవిలోకి వచ్చారు. ముందుగా అంబయ్యను కరెంట్ వైర్‌తో చెట్టుకు కట్టేసి నర్సింహులును మరో చోటుకి తీసుకెళ్లి సెల్‌ఫోన్ విషయమై ప్రశ్నించారు. లేదని చెప్పడంతో పకీరప్ప నర్సింహులును పట్టుకోగా కుర్వశ్రీనివాస్ పగులగొట్టిన బీరు బాటిల్‌తో గొంతుకోశాడు. ప్రాణాలు పోతున్నాయనే భయంతో నర్సింహులు వారిని తప్పించుకుని రోడ్డు పైకి చేరాడు. అటుగా వెళుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సునితారెడ్డి గమనించి పోలీసులను అలర్ట్ చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రున్ని వెంటనే చికిత్స నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. నిందితులిద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు హత్యాయత్నానికి దారి తీసిన పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.



హత్యాయత్నానికి గురైన నర్సింహులు

వైస్ చైర్మన్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

శంషాబాద్: శంషాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ భూ కబ్జా చేశాడంటు పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జిల్లపల్లి నరేందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్‌లు సోమవారం జిల్లా కలెక్టర్ శశాంకకు ఫిర్యాదు చేశారు. మహిళకు సంబంధించిన భూమిని కబ్జా చేయడంతో పాటు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడన్నారు. భూ కబ్జాపై సమగ్ర రెవిన్యూ సర్వే చేయించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ నేతల వినతి మేరకు వెంటనే సంబంధిత శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

శంకర్‌పల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మండలంలోని ఎల్వర్తి గ్రామానికి చెందిన జొన్నాడ హరిశంకర్(28) కొన్ని రోజుల క్రితం శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో ఫొటో స్టూడియోను ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం సాయంత్రం స్నేహితులతో కలిసి మద్యం తాగి స్టూడియోలోనే నిద్రపోయాడు. అర్ధరాత్రి సమయంలో అందులోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్టూడియో కోసం చేసిన అప్పుల ఒత్తిడి ఎక్కువ కావడంతో ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

అప్పుల బాధతో వెల్డర్ బలవన్మరణం

మొయినాబాద్: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సోమవారం మధ్యాహ్నం మొయినాబాద్ మండల కేంద్రంలో వెలుగుచూసింది. ఎస్సై కిషన్‌జీ తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం జొన్నాడ గ్రామానికి చెందిన మహ్మద్ మోబిన్(40) పన్నెండేళ్ల క్రితం మొయినాబాద్‌కు చెందిన పర్వీన్ ఉన్నీసాను పెళ్లి చేసుకుని ఇల్లరికం వచ్చాడు. వారికి ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వెల్డింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల వెల్డింగ్ పనికోసం కొంత మంది దగ్గర అడ్వాన్స్ తీసుకున్నాడు. దీంతోపాటు అప్పులు కూడా చేశాడు. అడ్వాన్స్ ఇచ్చినవారు, అప్పులు ఇచ్చినవారు డబ్బులు తిరిగివ్వాలని అడుగుతున్నారు. మూడు రోజుల క్రితం భార్య, పిల్లలను బంధువుల ఇంట్లో శుభకార్యానికి జహీరాబాద్ పంపించాడు. అప్పు ఇచ్చినవారు తిరిగివ్వాలని అడుగుతుండడంతో మనస్తాపం చెంది ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధ్యాహ్నం భార్య, పిల్లలు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో తలుపులు విరగొట్టగా ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. లోపలికి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో వ్యక్తి రిమాండ్

శంకర్‌పల్లి: పట్టణ కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం ఎదుట పార్కింగ్ చేసిన శంకర్‌పల్లి మున్సిపల్ ట్రాక్టర్, ట్రాలీ డిసెంబర్ 27న చోరీకి గురైంది. మున్సిపల్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. సీసీ ఫుటేజీలు, టెక్నాలజీని వినియోగించి ట్రాక్టర్ ఏ ప్రాంతానికి వెళ్లిందో గుర్తించారు. వికారాబాద్ జిల్లా, యాలాల మండలం, అగ్గనూరు గ్రామానికి చెందిన గోపాల్ వాహనాన్ని తీసుకెళ్లాడని నిర్ధారించారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

తప్పు చేస్తే కఠిన చర్యలు

- చౌడాపూర్‌లో దొరికిన కోడిగుడ్లు మహబూబ్‌నగర్‌వి
- స్త్రీ శిశుసంక్షేమ శాఖ జిల్లా అధికారి లలితాకుమారి

కుల్కచర్ల: అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే సరుకులు ఏవైనా బహిరంగ మార్కెట్‌లో అమ్మడం నిషేధమని, అందుకు విరుద్ధంగా ఎవరూ చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని స్త్రీ శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి లలితాకుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం చౌడాపూర్ మండల కేంద్రంలో అంగట్లో అంగన్‌వాడీ కోడిగుడ్లను విక్రయించిన విషయం 'సాక్షి'తో పాటుగా మీడియా ప్రముఖంగా ప్రచురించడంతో జిల్లా అధికారులు ఆ విషయంపై ప్రకటన విడుదల చేశారు. చౌడాపూర్‌లో లభ్యమైన కోడిగుడ్లు జోగులాంబ జోన్‌కి సంబంధించినవిగా ప్రాథమిక విచారణలో తేలిందని వివరించారు. దానిపై పోలీసులు నిశితంగా విచారించి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.



ఓటరు జాబితాలో తప్పులపై ఆగ్రహం

కరణ్‌కోటలో ఆర్డీఓ విచారణ

తాండూరు రూరల్: ఓటరు జాబితాలో తప్పులపై తాండూరు ఆర్డీఓ శ్రీనివాసరావు సీరియస్ అయ్యారు. మండల పరిధిలోని కరణ్‌కోట గ్రామంలో సోమవారం వీటిపై విచారణ చేపట్టారు. గ్రామ ఓటరు జాబితాలో 88 మందికి తండ్రి పేరు ఒకే రకంగా నమోదు అయింది. ఈ విషయమై ఇటీవల కాంగ్రెస్ నాయకులు ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా గ్రామంలో విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన ఓ యువకుడు సీఈఓ యాప్ ద్వారా ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టడం, తదితర సాంకేతిక కారణాలతో తండ్రి పేరు ఒకే రకంగా నమోదు అయిందన్నారు. ఈ నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తానని ఆర్డీఓ తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ తారాసింగ్, డీటీ మహేష్‌గౌడ్, ఆర్‌ఐ రాజురెడ్డి, సర్పంచ్ హేమంత్, నాయకులు రాజ్‌కుమార్, జర్నప్ప, శివకుమార్ తదితరులు ఉన్నారు.



గ్రామంలో విచారణ చేస్తున్న ఆర్డీఓ తదితరులు

ఆప్యాయతకు మారుపేరు జల్‌పల్లి

- ఇక్కడికి వస్తే అమ్మగారింటికి వచ్చినట్లుంటుంది
- ఎమ్మెల్యే సబితారెడ్డి



ఎంపీతో కలిసి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

మహేశ్వరం: ప్రేమ, ఆప్యాయతలకు మారుపేరైన జల్‌పల్లి మున్సిపాలిటీకి రావడం అంటే తనకు అమ్మగారింటికి వచ్చిన భావన కలుగుతుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ కట్టబెట్టిన జల్‌పల్లి మున్సిపాలిటీలో పార్టీ శ్రేణుల కోసం సోమవారం ఏర్పాటు చేసిన కృతజ్ఞత సమావేశంలో ఆమె చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల ఓట్ల లెక్కింపులో జల్‌పల్లి మున్సిపాలిటీ రౌండ్ రాగానే ఇతర పార్టీల నాయకులు ఓటమి తప్పదని కౌంటింగ్ హాల్ నుంచి వెళ్లిపోయారని గుర్తు చేశారు. తన విజయం కోసం పనిచేసిన అందరి కోసం.. తాను కూడా మనసు పెట్టి పని చేస్తానని తెలిపారు. మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ తనను గెలిపించేందుకు ఎంతో కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్లలో రంజిత్ రెడ్డి, హైదరాబాద్‌లో అసదుద్దీన్ ఒవైసీలను ఎంపీలుగా గెలిపించేందుకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. గతంలో నియోజకవర్గ అభివృద్ధికి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన రూ.169 కోట్లను తిరిగి సాధించి తీరుతానని ఆమె పేర్కొన్నారు. అనంతరం ఎంపీ రంజిత్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ తప్పుడు వాగ్దానాలతో మోసపోయి మాత్రమే ఆ పార్టీకి పట్టం కట్టారన్నారు. కానీ ఆ పార్టీ ఏ ఒక్క హామీని నెరవేర్చే స్థితిలో లేదన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో రూ.200 కోట్ల అభివృద్ధి చేసిన ఘనత సబితారెడ్డికే దక్కుతుందన్నారు. పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్ పాత్ర ఉండాల్సిన అవసరం ఉందని, ఈసారి ఎన్నికల్లో తనను గెలిపించాలని ఆయన కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో నాయకులు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, జల్‌పల్లి చైర్మన్ అబ్దుల్లా సాది, వైస్ చైర్మన్ ఫర్హానా నాజ్, యూసుఫ్ పటేల్, జనార్దన్, అఫ్జల్, లక్ష్మీనారాయణ, కొండల్‌యాదవ్, అహ్మద్ సాది, ఎక్బాల్ ఖలీఫా తదితరులు పాల్గొన్నారు.

వామ్మో కోతులు

- ఇళ్లలోకి దూరి దొరికింది ఎత్తుకెళ్తున్న వానరాలు
- భయాందోళనలకు గురవుతున్న మహిళలు
- పంట పొలాల్ని నాశనం చేస్తున్న మర్కటాలు

ధారూరు: ధారూరు మండలం కోతులకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. జిల్లాలోని అన్ని మండలాల కంటే ఇక్కడే ఎక్కువ మొత్తంలో అడవులు విస్తరించి ఉన్నాయి. మొదట్లో వానరాలు వందల సంఖ్యలో ఉండగా ప్రస్తుతం వేల సంఖ్యలో విస్తరించాయి. అడవుల్లో వాటికి భుజించడానికి ఏం దొరక్కపోవడంతో గ్రామాలు, తండాల్లోని పంట పొలాలకు, చివరకు ఇళ్లపైకీ వస్తున్నాయి. పొలాల్లో పంటలున్న సమయంలో అక్కడే తిష్టవేసి పంటలను నాశనం చేస్తున్నాయి. ఒక్కొక్కరు చొప్పున కాపలా ఉన్నా వాటికి భయమనేది ఉండదు. ఇద్దరు, ముగ్గురు ఉంటేనే ఆ పొలం వైపు వెళ్లవు. గుంపులుగా రైతులపై దాడిచేసి గాయపరుస్తున్న సంఘటనలు లేకపోలేదు. పొలంలో ఏ పంట వేసినా పీకేయడం, తినడం సర్వసాధారణమైంది. వీటి నుంచి పంటను కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. గ్రామాల్లోకి వచ్చే సమయంలో రోడ్లకు అడ్డంగా పరుగుతీస్తూ వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. తరచూ ద్విచక్ర వాహనదారులు రోడ్లపై కోతుల సంచారంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. కోతుల బెడదను నివారించాలని స్థానికులు కోరుతున్నా గత పదేళ్ల కాలంలో ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

తిండి దొరక్క

ధారూరు మండలంలోని దాదాపు 35 గ్రామాలతో పాటు పలు తండాల్లో కోతుల బెడద ఉంది. సాగుచేసిన పంటల్ని నాశనం చేయడంతో పాటు సమీప గ్రామాల ఇళ్లపైకి ఎక్కి నానా హంగామా చేస్తున్నాయి. మగవారు ఇళ్లలో లేని సమయాల్లో వానరాలు ఇళ్లలోకి దూరుతున్నాయని, ఇంట్లో ఉన్నా వారిని భయపెట్టి అందిన ఆహారాన్ని ఎత్తుకెళుతున్నాయి. వాటిని పారద్రోలే ప్రయత్నం చేస్తే కోతులు దాడులు చేయడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఒక్కోసారి పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల టిఫిన్ బాక్సులు కనిపిస్తే చాలు లాక్కుని ఎత్తుకెళుతున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. కూరగాయల సంతలో, ఇళ్లపైన నిత్యం సంచరిస్తూ వీలైనప్పుడల్లా ఎత్తుకెళుతున్నాయి.



కోట్‌పల్లి ప్రాజెక్టుకు వెళ్లే రోడ్డులో కోతుల గుంపు

ఎదురు దాడికి దిగుతున్న వైనం

మగవాళ్లు లేని సమయాల్లో ఇళ్లలోకి దూరుతున్నాయని, వాటిని ఎదురించే ప్రయత్నం చేస్తే దాడులకు పాల్పడుతున్నాయని మహిళలు వాపోయారు. ఎక్కువగా మహిళలు, చిన్నారులు, వృద్ధులను భయపెడుతున్నాయని ప్రజలు తెలుపుతున్నారు. మగవాళ్లున్న సమయాల్లో ఇళ్ల ముందున్న చెట్లపై సంచరిస్తున్నాయని, వెళ్లగొట్టే ప్రయత్నం చేసినా ఇలా వెళ్లి అలా తిరిగి వస్తున్నాయని వారు వాపోయారు. కుక్కలకు, కొండముచ్చులకు కూడా కోతులు భయపడటం లేదని, వాటిపైకి ఎదురుదాడికి దిగుతున్నాయని చెప్పారు. తాండూరు–హైదరాబాద్ ప్రధాన రోడ్డుపై, కోట్‌పల్లి ప్రాజెక్టుకు వెళ్లే రోడ్డుపైన సంచరిస్తూ వాహనదారులను ఇబ్బందులతో పాటు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అధికారులు చొరవ తీసుకుని కోతులను అడవులకు వెళ్లేలా చేస్తే ప్రశాంతంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



ఓ ఇంటి ముందు హంగామా చేస్తున్న వానరాలు

తప్పిపోయిన వృద్ధురాలి అప్పగింత

మానవత్వం చాటుకున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం: మతి స్థిమితం కోల్పోయి ఇంటి నుంచి తప్పిపోయిన వృద్ధురాలిని చేరదీసి కుటుంబ సభ్యులకు అప్పగించిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐలు రామకృష్ణ, మైబెల్లిలు తెలిపిన వివరాల ప్రకారం.. బాలపూర్ సమీపంలోని అల్మాస్‌గూడకు చెందిన నేనవత్ చండి(70) మతిస్థిమితం కోల్పోయారు. ఇంటి నుంచి మూడు రోజుల క్రితం తప్పిపోయి తిరుగుతూ స్థానికంగా ఉప్పరిగూడ వద్దకు చేరుకున్నారు. అక్కడ రోడ్డుపై తిరుగుతుండగా సోమవారం పోలీసుల కంట పడ్డారు. కానిస్టేబుల్‌లు రాజు, ప్రేమలత ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. వృద్ధురాలిని మాట్లాడించేందుకు పోలీసులు యత్నిస్తున్నా సరైన సమాధానం రాలేదు. అయితే బాలపూర్ పేరు ప్రస్తావిస్తుండటంతో అక్కడ పోలీస్‌స్టేషన్‌కు ఆమె ఫొటోలు పంపించారు. అక్కడి మొబైల్ పెట్రోలింగ్ పోలీసులు ఆమె ఫొటోలను పలువురికి చూపిస్తూ వాకబు చేయగా అల్మాస్‌గూడవాసిగా గుర్తించారు. అక్కడ ఆమె మనువడు నేనావత్ పవన్‌కు పోలీసులు ఈ విషయాన్ని తెలపడంతో ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తీసుకెళ్లారు.